క్లుప్తంగా

పోచమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన



పూజాకార్యక్రమంలో పండితులు, భక్తులు

తలకొండపల్లి: మండల పరిధి చెన్నంపల్లిలో నూతనంగా నిర్మించిన పోచమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. వేడుకల్లో భాగంగా శుక్రవారం జలధివాసం నిర్వహించారు. పండితులు నరసింహయ్య శర్మ, యాదగిరిల ఆధ్వర్యంలో గణపతి పూజ, యాగశీల, అగ్నిప్రతిష్ట, పంచగవ్య అధివాసం, ధాన్యాధివాసం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ శ్రీనివాస్ యాదవ్ ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేత శ్రీనివాస్ యాదవ్, మాజీ సర్పంచ్ రమేష్ యాదవ్, లక్ష్మీ నారాయణగౌడ్, తిరుపతయ్య, శ్రీను, కృష్ణయ్య, రామస్వామి, నరేందర్‌గౌడ్, భక్తులు పాల్గొన్నారు.

బొమ్మలచెరువును పరిరక్షించండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

అబ్దుల్లాపూర్‌మెట్: ఆక్రమణదారుల చెర నుంచి బొమ్మలచెరువును పరిరక్షించాలని మండల పరిధి పిగ్లీపూర్ గ్రామస్తులు కోరారు. ఈ మేరకు శుక్రవారం తహసీల్దార్ రవీందర్ దత్తుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామంలోని సర్వే నంబర్ 46లో సుమారు 22.11ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చెరువును కొంతమంది రియల్‌ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. ఇందులో భాగంగా ఎఫ్‌టీఎల్ పరిధిని మట్టితో నింపివేస్తున్నారని పేర్కొన్నారు. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు స్పందించి చెరువును పూర్తిస్థాయిలో సర్వే చేయించి, ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

బోనాల ఉత్సవాలకు రూ.లక్ష విరాళం



కమిటీ సభ్యులకు విరాళం అందజేస్తున్న జీఎల్ఎన్‌రెడ్డి

ఆమనగల్లు: కడ్తాల్ మండల కేంద్రంలో ఈ నెల 24 నుంచి నిర్వహించే బోనాల ఉత్సవాల సందర్భంగా శుక్రవారం పోచమ్మ ఆలయ కమిటీ నిర్వాహకులకు కడ్తాల్ మాజీ సర్పంచ్ గూడూరు లక్ష్మీ నర్సింహారెడ్డి రూ.లక్ష విరాళం అందజేశారు. కార్యక్రమంలో చైర్మన్ సత్యం యాదవ్, సభ్యులు రాములు, నరేందర్‌రెడ్డి, మల్లేశ్‌గౌడ్, వెంకటేశ్, యాదయ్య, రాములు, వెంకటేశ్, కార్తీక్, శ్రీను, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీ చైర్మన్‌కు సత్కారం



విష్ణువర్ధన్‌రెడ్డిని సత్కరిస్తున్న వెంకటేశ్ గుప్తా

ఆమనగల్లు: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా డీసీసీబీ చైర్మన్‌గా ఎన్నికైన విష్ణువర్ధన్‌రెడ్డిని డీసీసీబీ డైరెక్టర్, ఆమనగల్లు సింగిల్‌విండో చైర్మన్ గంప వెంకటేశ్ గుప్తా ఘనంగా సత్కరించారు. డీసీసీబీ చైర్మన్‌గా పనిచేసిన నిజాం పాషా.. ఇటీవల రాజీనామా చేయగా శుక్రవారం నిర్వహించిన ఎన్నికల్లో విష్ణును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన చైర్మన్‌ను సత్కరించి అభినందనలు తెలిపారు. డీసీసీబీ వైస్ చైర్మన్ వెంకటయ్య, డైరెక్టర్లు రంగారెడ్డి, వంశీరెడ్డి, బీమ్‌రెడ్డి, నర్సింహారెడ్డి, భూపాల్‌రావ్, నర్సింహ, లక్ష్మీనారాయణ, రఘునందన్‌రెడ్డి పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

బడంగ్‌పేట్: అన్ని డివిజన్లలో సీసీరోడ్లతో పాటు బీటీరోడ్లు ఇతర మౌలిక సదుపాయాలు వేగంగా జరుగుతున్నాయని మేయర్ చిగురింత పారిజాత అన్నారు. శుక్రవారం కార్పొరేషన్ పరిధి 20వ డివిజన్ అన్నపూర్ణనగర్, శ్రీవిద్యా టౌన్‌షిప్ కాలనీల్లో ఆమె సీసీరోడ్డు పనులు ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. అభివృద్ధికి సహకరిస్తున్న ప్రజలు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

అనువైన చోటే.. అయినా ఆపరు

- మండల కేంద్రంలో ఆగని ఎక్స్‌ప్రెస్ బస్సులు..
- చేయెత్తినా పట్టించుకోని సిబ్బంది
- అడిగిన వారికి నిర్లక్ష్య సమాధానమే
- నయానగరి నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం
- మెరుగుపడని రవాణా సౌకర్యం



యాచారం ఆర్టీసీ బస్టాండ్




బస్టాండ్‌లోకి రాకుండా వెళ్తున్న డీవీకే ఎక్స్‌ప్రెస్ బస్సు

యాచారం: నిత్యం వందల కొద్ది ఆర్టీసీ బస్సులు మండలంలోని నాగార్జునసాగర్–హైదరాబాద్ హైవే మీదుగా రాకపోకలు సాగిస్తుంటాయి. కానీ.. మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లోకి రావు. చేయెత్తినా నిలపరని ప్రాంత ప్రజలు పేర్కొంటున్నారు. దేవరకొండ డిపోనకు చెందిన సర్వీసులు దేవరకొండ నుంచి ఎంజీబీఎస్ వరకు మాల్, తమ్మలోనిగూడ, చింతపట్ల, తక్కళ్లపల్లి, యాచారం, గునుగల్, ఆగాపల్లి, ఇబ్రహీంపట్నం, మంగల్‌పల్లి, బొంగ్లూర్, తుర్కయంజాల్, బీఎన్‌రెడ్డి, సాగర్‌రింగ్‌రోడ్డు, సంతోష్ నగర్, మలక్‌పేట, ఎంజీబీఎస్ వరకు సర్వీసులు పరుగులు తీస్తుంటాయి. కానీ.. మండల కేంద్రంలోని బస్టాండ్‌లో ఆ డిపో బస్సులు ఆపకపోవడం వలన ప్రాంత ప్రయాణికులకు రవాణా కష్టాలు వెంటాడుతున్నాయి. ఒక వేళ ఆపినా ప్రయాణికుల పట్ల ఆర్టీసీ సిబ్బంది దురుసుగా ప్రవర్తిస్తారన్న ఆరోపణలు ఉన్నాయి. బీఎన్‌రెడ్డి నగర్ నుంచి మాల్ వరకు దేవరకొండ బస్సుల్లో ప్రయాణికులు, సంస్థ సిబ్బంది మధ్య నిత్యం ఘర్షణలు చోటుచేసుకుంటున్నట్లు సమాచారం.

ప్రయాణ ప్రాంగణంలోకి వచ్చేలా..

సాగర్‌రోడ్డుపై పరుగులు తీసే ప్రతి ఆర్టీసీ బస్సును మండల కేంద్రంలోని ప్రయాణ ప్రాంగణంలోకి వచ్చి వెళ్లేలా చర్యలు తీసుకోవాలని సంస్థ అధికారులను మండల ప్రజలు కోరుతున్నారు. తాజాగా మండలం సమీపంలోని నయానగరి పట్టణ నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ సమయంలో ప్రజా రవాణా సౌకర్యం చాలా అవసరం. వేలాది మంది కార్మికులు, వ్యాపారం, ఉద్యోగ రిత్యా స్థానిక బస్టాండ్ నుంచి నిత్యం సుమారు వేలాది సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. ఇక విద్యార్థుల సంఖ్య మరింత అధికంగానే ఉంటుంది. కావున దేవరకొండ డిపోతో పాటు ఏపీకి చెందిన మాచర్ల, కనిగిరి డిపోల బస్సులకు ఇక్కడ హాల్టింగ్ ఉండేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ఫిర్యాదులు నిజమే



బస్టాండ్‌లోకి దేవరకొండ డిపోనకు చెందిన ఎక్స్‌ప్రెస్ బస్సులు రావడం లేదని ప్రయాణికుల నుంచి ఫిర్యాదు అందాయని ఆ డిపో మేనేజర్ రమేష్‌బాబు తెలిపారు. కొందరు డ్రైవర్లు ప్రయాణికుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారన్న విషయం తమ దృష్టికి వచ్చిందని, ఈ అంశంపై సిబ్బందికి కౌన్సెలింగ్ ఇచ్చామని పేర్కొన్నారు. పక్షం రోజుల పాటు బస్టాండ్‌లో డీవీకేకు చెందిన సిబ్బందిని నియమించి, ప్రతి బస్సు ఆగేలా కృషి చేస్తామన్నారు. బస్టాండ్ నోటీసు బోర్డుపై డీవీకే బస్సులు యాచారం బస్సాండ్‌లోకి వెళ్లాలని పేర్కొంటూ వివరణ అంటించామని వెల్లడించారు.

ప్రతి బస్సు నిలపాలి



మండల కేంద్రంలో ఆర్టీసీ బస్టాండ్ ఉన్నప్పటికీ దేవరకొండ డిపోనకు చెందిన ఎక్స్‌ప్రెస్ బస్సులు ఆపడం లేదు. చేయెత్తినా పట్టించుకోరు. డ్రైవర్లు, కండక్టర్ల దురుసు ప్రవర్తనతో ఆర్టీసీ ఆదాయం కోల్పోతోంది. డీవీకే మేనేజర్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం కానరావడం లేదు. ప్రయాణ ప్రాంగణంలో ప్రతి బస్సు నిలిపేలా సంస్థ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి.

– మేకల యాదగిరిరెడ్డి, ప్రయాణికుడు, మొండిగౌరెల్లి

ఏఓ జ్యోతిశ్రీ బదిలీ



ఏఓ, ఏఈఓను సన్మానించిన నాయకులు, రైతులు

మంచాల: మండల వ్యవసాయ అధికారి జ్యోతి శ్రీ రాజేందర్ నగర్ వ్యవసాయ శాఖ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో అక్కడి నుంచి మాధవీలత ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా శుక్రవారం జ్యోతి శ్రీతో పాటు బదిలీ అయిన ఏఈఓ సరితను రైతు సంఘాల నాయకులు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఐదేళ్లుగా ఆమె చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠానోత్సవం

- పాల్గొన్న ఎమ్మెల్యే కసిరెడ్డి, బీజేపీ నేత ఆచారి

ఆమనగల్లు: పట్టణంలోని సురసముద్రం చెరువు కట్టపై పునర్నిర్మించిన కట్ట మైసమ్మ దేవాలయంలో శుక్రవారం మైసమ్మ విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు ఘనంగా జరిగాయి. మూడు రోజులుగా జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా ఆఖరి రోజు శుక్రవారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహాగాయత్రీ దేవి ఉపాసకురాలు నారాయణీ ప్రత్యంగిరా మాతా పర్యవేక్షణలో పూజారులు నాగభూషణం, శరత్‌చంద్ర, రామకృష్ణ శర్మల ఆధ్వర్యంలో కనుల పండువగా విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, బీసీ కమిషన్ జాతీయ మాజీ సభ్యుడు ఆచారి, కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడు బాలాజీసింగ్, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, ఆలయ కమిటీ చైర్మన్ వెంకటయ్యలు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మాతాజీ ఆధ్వర్యంలో మహాయజ్ఞం నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, జెడ్పీటీసీ మాజీ సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, హరిప్రసాద్, మాజీ ఎంపీపీ లలిత, మాజీ సర్పంచ్ కేశవులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, లయన్స్‌క్లబ్ ఉపాధ్యక్షుడు రాము, సీఐ ప్రమోద్‌కుమార్, ఎస్ఐ వెంకటేశ్, కౌన్సిలర్లు విజయ్‌కృష్ణ, చెన్నకేశవులు, లక్ష్మణ్, శేఖర్, శ్రీకాంత్‌సింగ్, కృష్ణయాదవ్, మేడిశెట్టి శ్రీధర్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకుడు రాములు, మండల అధ్యక్షుడు జగన్ తదితరులు పాల్గొన్నారు.



పూజాకార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తదితరులు

పాత పింఛన్ పునరుద్ధరించాలి



ఇబ్రహీంపట్నంలోని డిగ్రీ కళాశాల ఎదుట నిరసన వ్యక్తంచేస్తున్న అధ్యాపకులు, సిబ్బంది

ఇబ్రహీంపట్నం: పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలని సీపీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర సాంస్కృతిక కార్యదర్శి డా.చింతల రాకేశ్ భవాని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం పట్నం డిగ్రీ కళాశాల అధ్యాపకులు, సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి, విధుల్లో పాల్గొని నిరసన వ్యక్తం చేశారు. అనంతరం పలువురు మాట్లాడారు. సీపీఎస్ వలన ఉపాధ్యాయుల కుటుంబాల్లో చీకటి నింపిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీమేరకు సీపీఎస్‌ను రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు డీవీ రావు, నరేందర్ రెడ్డి, సురేష్, రమేష్, సురేఖ, శంకర్, ధనరాజ్, పవన్ కుమార్, శ్రీకృష్ణ, వీరారెడ్డి, రవికుమార్, కళ్యాణి, ప్రసాద్‌లు పాల్గొన్నారు.

మంచాలలో..

మంచాల: ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం కొత్త పెన్షన్ విధానం రద్దు చేయాలని పీఆర్‌టీయూ తెలంగాణ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి సత్తారి రాజిరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం మంచాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ కాంట్రిబ్యూటరీ పెన్షన్ సంఘం తీర్మానం మేరకు జీఓ 28కి వ్యతిరేకంగా ఆగస్టు 23న బ్లాక్ డేగా పాటించామని తెలిపారు. గత ప్రభుత్వం తెచ్చిన జీఓను రాష్ట్ర సీపీఎస్ ఉద్యోగులకు చీకటి రోజు అని అభివర్ణించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమని, ఇచ్చిన మాట ప్రకారం కొత్త పెన్షన్ విధానం రద్దు చేసి మాట నిలబెట్టుకోవాలని కోరారు.

రుణమాఫీపై ప్రతిపక్షాల దుష్ప్రచారం

- బీఆర్ఎస్ నాయకుల మాటలను నమ్మకండి
- క్రమంగా అర్హులందరికీ లబ్ధిచేకూరుతుంది
- రైతులకు సూచించిన కాంగ్రెస్ శ్రేణులు



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ఆమనగల్లు: రైతు రుణమాఫీపై ప్రతిపక్ష పార్టీలు దుష్ప్రచారం చేస్తున్నాయని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డిలు ఆరోపించారు. శుక్రవారం వారు మాట్లాడారు. ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేసిందని తెలిపారు. రుణమాఫీ దిగ్విజయంగా జరగడంతో ఆ పార్టీ నాయకులు జీర్ణించుకోలేక పోతున్నారని మండిపడ్డారు. మాఫీ విషయంలో మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావ్‌లు విష ప్రచారం చేస్తూ రైతులను అయోమయానికి గురి చేస్తున్నారని పేర్కొన్నారు. గతంలో రైతులను మోసగించిన బీఆర్ఎస్ పార్టీకి రుణమాఫీ గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. ఆ నేతల మాటలను నమ్మి రైతులు మోసపోవద్దని, అర్హులందరికీ రుణమాఫీ వస్తుందని చెప్పారు. సమావేశంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగన్, పట్టణ అధ్యక్షుడు మానయ్య, మాజీ ఎంపీపీ ధనుంజయ, నాయకులు పర్వతాలు, బలరాం, కాలె మల్లయ్య తదితరులు ఉన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

- ఐసీడీఎస్ సీడీపీఓ శాంతిశ్రీ

మహేశ్వరం: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యమని ఐసీడీఎస్ సీడీపీఓ శాంతిశ్రీ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అంగన్‌వాడీ టీచర్లకు వారి కేంద్రానికి సంబంధించి ప్రీ స్కూల్ కిట్లు పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడారు. కేంద్రాల్లో పంపిణీ చేసే పౌష్టికాహారం పిల్లలు, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు తినేలా ప్రోత్సహించాలని, పిల్లల హాజరు శాతం పెంచాలని, ప్రీ స్కూల్ మెటీరియల్‌ను చిన్నారులకు అందజేయాలని సూచించారు. పట్టిక ప్రకారం పిల్లల బరువు, ఎత్తు కొలవాలని చెప్పారు. అంతకు ముందు పూర్వ ప్రాథమిక విద్య, టైమ్ టెబుల్‌ను వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శైలజ, దుబ్బచర్ల ప్రభుత్వ ఆస్పత్రి మెడికల్ అధికారి డా.మల్లికార్జున్, హెల్త్ సూపర్‌వైజర్ నర్సింలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత

మీర్‌పేట: ఆపదలో ఉన్న నిరుపేద ప్రజలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతగానో ఉపయోగపడతుందని ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్‌గుప్తా అన్నారు. మీర్‌పేట కార్పొరేషన్ ఓల్డ్ బాలాజీనగర్‌కు చెందిన శ్యామ్‌రావు కొంతకాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. వైద్యం చేయించుకునేందుకు లక్షల్లో డబ్బు కావాల్సి ఉంది. దీంతో కాంగ్రెస్ నియోజకవర్గ నాయకుడు బాలకిషన్ ద్వారా ఎమ్మెల్సీ దృష్టికి తీసుకెళ్లగా.. సీఎం సహాయనిధి నుంచి రూ.2లక్షల 50 వేల ఎల్‌ఓసీని మంజూరు చేయించారు. శుక్రవారం ఎల్‌ఓసీ పత్రాన్ని శ్యామ్‌రావుకు ఎమ్మెల్సీ అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తుర్కయంజాల్: ఫీడర్ మరమ్మతుల కారణంగా శనివారం తుర్కయంజాల్ సబ్‌స్టేషన్ పరిధి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఏడీఈ వినోద్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. నాదర్‌గుల్ ఆదిత్యా నగర్ ఫీడర్ కింద ఆదిత్యానగర్, టీచర్స్ కాలనీ, గుర్రంగూడ, హరితపురి కాలనీ, స్వామి నారాయణ కాలనీ, రాజలక్ష్మి కాలనీ, శ్రీలక్ష్మి కాలనీల్లో ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు, టీసీఎస్ ఫీడర్ పరిధి మన్నెగూడ, దుర్గాంజనాద్రి, విజేత ప్రాజెక్ట్స్, సంపదహోమ్స్, పగోడ ప్లాజా, సిరిటౌన్‌షిప్‌లో మధ్యాహ్నం 1గంటల నుంచి 1.30గంటల వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు. అదే విధంగా కమ్మగూడ ఫీడర్ కింద కమ్మగూడ, ఈస్ట్ సూరజ్ నగర్, ఏపీఏటీ కాలనీ, టీచర్స్ కాలనీ, వీరమణి బిస్కెట్స్ కంపెనీ, నవభారత్ కాలనీల్లో మధ్యాహ్నం 1.30 నుంచి 3 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు ఏడీఈ పేర్కొన్నారు. ఈ అసౌకర్యానికి చింతిస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

తుర్కయంజాల్: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం శనివారం రాగన్నగూడ ఏబీఆర్ కన్వెన్షన్ హాల్‌లో చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు కమిషనర్ అమరేందర్ రెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, భువనగిరి పార్లమెంట్ సభ్యుడు చామల కిరణ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డితో పాటు పలు శాఖల అధికారులు పాల్గొననున్నారని ఆయన పేర్కొన్నారు.

పత్తి పంటపై అడవి పందుల దాడి



పంటను చూపిస్తున్న రైతు శంకర్

యాచారం: పత్తిపంటపై అడవి పందులు దాడి చేశాయి. ఈ ఘటనలో ఎకరా పత్తి పంటకు నష్టం వాటిల్లింది. కడ్తాల్ మండల పరిధి పల్లెచల్కతండాకు చెందిన ఇస్లావత్ శంకర్ మల్కీజ్‌గూడలో రమేష్ అనే రైతుకు చెందిన మూడు ఎకరాల సాగు భూమిని కౌలుకు తీసుకుని, పత్తిని సాగు చేశాడు. గురువారం రాత్రి అడవి పందులు పంటపై దాడిచేసి, తీవ్ర నష్టం కలిగించాయి. పంట ఏపుగా పెరిగి, పూత వస్తున్న సమయంలో పందులు ఇలా చేశాయని బాధిత రైతు శంకర్ వాపోయాడు. ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశాడు

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం



రోగులకు మందులు పంపిణీ చేస్తున్న వైద్యులు, నాయకులు

తలకొండపల్లి: వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు, పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు సంక్రమించవని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఉప్పల వెంకటేశ్ అన్నారు. శుక్రవారం మండల పరిధి గట్టుఇప్పలపల్లిలో ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వెంకటేశ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. డాక్టర్ అఖిల్, హైదరాబాద్ కామినేని ఆస్పత్రి ఆధ్వర్యంలో 416 మంది రోగులకు బీపీ, షుగర్, కీళ్ల నొప్పులు, జలుబు, దగ్గు, గొంతు నొప్పి, వైరల్ ఫీవర్ తదితర వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేశారు. మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉప్పల మాట్లాడుతూ.. ఎవరికి ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఉన్నా.. తక్షణమే వైద్యులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ హరికిషన్‌రెడ్డి, మైసయ్య, గౌడ సంఘం కల్వకుర్తి నియోజకవర్గ అధ్యక్షుడు అశోక్‌గౌడ్, మాజీ సర్పంచ్ జయమ్మ, వెంకటయ్య, రాఘవేందర్, పాపిరెడ్డి, మండల కృష్ణయ్య, రేణురెడ్డి, నాగరాజు, చెన్నయ్య, భాస్కర్, శ్రీశైలం, బుచ్చిబాబు, అంజయ్య, కృష్ణయ్య, యువకులు, వైద్య సిబ్బంది, కృష్ణ, ఆంజనేయులు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతిలో సాగు చేయాలి

- అధిక దిగుబడితో మంచి లాభాలు పొందండి
- పీఏసీఎస్ చైర్మన్ హన్మంత్‌రెడ్డి



సదస్సులో మాట్లాడుతున్న వ్యవసాయ అధికారులు

మంచాల: ఆధునిక పద్ధతుల్లో రైతులు పంటలను సాగుచేయాలని పీఏసీఎస్ చైర్మన్ హన్మంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రైతు వేదిక భవనంలో మెట్ట వ్యవసాయ పరిశోధన సంస్థ, క్రిషి జాగ్రన్, క్రిషి విజ్ఞాన కేంద్రం సంయుక్తంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పంటల సాగు విషయంలో రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు, సలహాలు తీసుకోవాలని సూచించారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి వచ్చే పంటలను సాగు చేసి, అధిక లాభాలు పొందాలని చెప్పారు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అనంతరం వ్యవసాయ అధికారులు చంద్రకాంత్, సుధీర్, మాధవీలత, విజయ్‌కుమార్, దిలీప్ ఆధునిక పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు లింగ స్వామి, సాయిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సబితది అధికార దాహమే

- ఇక్కడ గెలిచి.. అక్కడి వారి కోసం పోరాటమా?
- సబితకు మహేశ్వరం ప్రజలపై ప్రేమలేదు
- సబితారెడ్డిపై మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్ మండిపాటు



మహేశ్వరం: ఎమ్మెల్యే సబితారెడ్డికి అధికార దాహమే తప్ప నియోజకవర్గ ప్రజలపై ప్రేమ లేదని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి ఆరోపించారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే సబితారెడ్డి మహేశ్వరం ఎమ్మెల్యేగా గెలుపొంది, చేవెళ్ల రైతుల కోసం పోరాటం చేస్తుందని విమర్శించారు. రైతుల రుణమాఫీ చేయాలని బీఆర్ఎస్ నేతలు ఎవరి నియోజకవర్గాల్లో వారు ధర్నాలు చేస్తే, సబితారెడ్డి మాత్రం మహేశ్వరంలో ధర్నా చేయకుండా చేవెళ్లలో కూర్చున్నారని ఎద్దేవా చేశారు. ఇక్కడి ప్రజలతో అధికారం చే పట్టిన ఆమె.. పక్క నియోజకవర్గంలో నిరసన వ్యక్తం చేయడమేంటని ప్రశ్నించారు. నా భయానికి ఆమె నియోజకవర్గం మారనుందన్న అనుమానం వస్తుందని ఆయన తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి ముచ్చర్ల ఫోర్త్‌సిటీ ఇన్‌చార్జిగా తనను ప్రకటిస్తే సబిత జీర్ణించు కోలేకపోతున్నారని పేర్కొన్నారు. ఆమెను ఇక్కడి ప్రజలు చేవెళ్లకు పంపిస్తారని వెల్లడించారు.

ఆర్టీసీ సేవలను వినియోగించుకోండి

కందుకూరు: ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని లేమూరు మాజీ సర్పంచులు జి.కొండారెడ్డి, ఢిల్లీ గణేష్ కోరారు. మిథాని డిపోకు చెందిన ఆర్టీసీ బస్సును ఉమెన్స్ కాలేజ్ నుంచి లేమూరు వరకూ రోజూ మూడు ట్రిప్పులు తిరిగేలా అధికారులు ఏర్పాటు చేశారు. శుక్రవారం లేమూరుకు నూతనంగా వచ్చిన ఆ సర్వీసుకు గ్రామస్తులతో కలిసి వారు పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల రవాణాల అవసరాలను గుర్తించి సమస్యను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవడం శుభపరిణామమని కొనియాడారు. కార్యక్రమంలో స్థానికులు గుల్వి జైపాల్, మల్లేష్, గుల్వి యాదయ్య, కడారి గణేష్, ఎస్.మల్లేశ్, సీహెచ్ కృష్ణ, కె.పొన్నమ్మ, కె.శైలజ, కె.రాములమ్మ, బాబు రావు, దర్శన్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
బి. కిరణ్‌కుమార్
9912220386